ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023

కళ్యాణమస్తు, షాదీతోఫా మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్ తదితరులు

కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం అందజేత

◆ జిల్లాలో 4699 మందికి రూ.3.86 కోట్ల సాయం

◆ జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద జూలై, సెప్టెంబర్-2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 469 మందికి రూ.3.86 కోట్ల సాయాన్ని ప్రభుత్వం అందజేసిందని జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని విసి హాల్ కళ్యాణమస్తు, షాదీతోఫా జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, నగర పాలక సంస్థ మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మంజుల, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ రిజ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా జిల్లాలో 469 మందికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అందించే సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, డిటిడబ్ల్యూఒ అన్నాదొర, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రికి జాగాదొరకలేదు..!

◆ ఏడాదిన్నరగా స్థల పరిశీలనకే పరిమితం

◆ డిస్పెన్సరీలతోనే సరి

◆ రెఫరల్ ఆసుపత్రులూ లేవు

◆ అందని ద్రాక్షలా కార్మికులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడాదిన్నరగా ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి జాగా దొరకలేదు. ఆసుపత్రి మంజూరై 18 మాసాలు పూర్తయినా స్థలం దొరక్క నిర్మాణాలు ప్రారంభమవలేదు. మరోవైపు రెఫరల్ ఆసుపత్రులు కూడా స్థానికంగా లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు అనారోగ్యం బారినపడితే లక్షలు ఖర్చు పెట్టుకుని వైద్య సేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఖరారు చేయడంలోగానీ, రెఫరల్ ఆసుపత్రులను కేటాయించే అంశంపైగాని పాలకులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.

ఏడాదిన్నర క్రితం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు

2022 మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో ఆసుపత్రులను మంజూరు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ధారించారు. కాని ఇప్పటికీ స్థల నిర్ధారణ పూర్తవలేదు. రెండు పర్యాయాలు కేంద్ర ఈఎస్ఐ అధికార బృందం పర్యటించి కూడా వెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి చొరవ లేకపోవడంతో ఈ ఆసుపత్రి ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే అందరూ ఉన్నప్పటికీ దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. హిందూపురం పార్లమెంట్ సభ్యులుగానున్న గోరంట్ల మాధవ్ సైతం దీని ఏర్పాటుకు కృషి చేయాలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

డిస్పెన్సరీల్లో ప్రాథమిక చికిత్సతోనే సరి..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇఎస్ఐ పరిధిలో 40వేల మందికిపైగా కార్మికులున్నారు. యజమాన్యాల తరుపున ఈఎస్ఐకు కొంత మొత్తాన్ని రెగ్యులర్‌గా చెల్లిస్తున్నారు. వీరికి కార్మికశాఖ ద్వారా ఈఎస్ఐ నుంచి అవసరమైన వైద్య సేవలందాల్సి ఉంది. ఇందుకుగానూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, హిందూపురంలో రెండు డిస్పెన్సరీలున్నాయి. అక్కడ ప్రాథమిక వైద్యం వరకు అందించడానికి వీలుంది. ఏదైనా క్లిష్టతరమైన ఆరోగ్య సమస్యలొస్తే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలందించాల్సి ఉంటుంది. దీనికి గతంలో రెండు ప్రయివేటు ఆసుపత్రులకు రెఫర్ చేసేవారు. ఇప్పుడు ఆ రెఫరల్ ఆసుపత్రులను కూడా తొలగించారు. ఏదైనా ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉంటే తిరుపతికెళ్లాల్సి ఉంటుంది. అక్కడా పరీక్షించి మెరుగైన వైద్యమందివ్వాలంటే అక్కడి నుంచి వారు రెఫర్ చేయాల్సి ఉంటుంది. దీంతో కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్యమందటం ఇబ్బందికరంగా మారింది. కనీసం రెఫరల్ ఆసుపత్రులను అయినా స్థానికంగా ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఈఎస్ఐ వైద్యసేవలందే విధంగా చర్యలు తీసుకోవాలి

ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటుకు సాధ్యమైనంత త్వరగా స్థలం కేటాయించి, నిర్మాణం చేపట్టాలి. అంత వరకు స్థానికంగా అవసరమైన వైద్యసేవలందించేందుకు వీలుగా రెఫరల్ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి. కార్మికులకు ఏదైనా సమస్యలొస్తే వైద్యానికి అధికంగా ఖర్చులై అప్పులపాలయ్యే పరిస్థితులున్నాయి. కావున ప్రభుత్వం చొరవచూపి ఇఎస్ఐల ద్వారా మెరుగైన వైద్యసేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

నాగేంద్ర కుమార్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

బాబా స్వర్ణరథోత్సవ వేడుకల్లో పాల్గొన్న సత్యసాయి ట్రస్టు సభ్యులు, ఎమ్మెల్యే, కలెక్టర్లు

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రశాంతి నిలయంలో వైభవంగా స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నాడు ప్రశాంతి నిలయం స్వర్ణ రథోత్సవ వేడుకలను నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి 6 గంటల వరకు ప్రశాంతి నిలయంలో స్వర్ణ రథోత్సవ వేడుకలు జరిగాయి. స్వర్ణ రథంపై సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ మందిరం చుట్టూ పురవీధుల్లో ఊరేగించారు. గతంలో సత్యసాయిబాబా రథంలో ఊరేగేవారు. ప్రస్తుతం బాబా చిత్రపట్టాన్ని రథంలో ఉంచి ఊరేగించే ఆనవాయితీని ట్రస్టు సభ్యులు కొనసాగిస్తున్నారు. స్వర్ణ రథాన్ని చూడటానికి ప్రజలు, భక్తులు, పర్యాటకులు పుట్టపర్తి వీధుల్లో బారులుదీరారు. అనంతరం సాయి కుల్వంత్ హాలులో సాయి విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాన్ని ఉయ్యాలలో ఉంచి జోలపాట పాడారు. స్వర్ణ రథోత్సవ వేడుకల్లో సత్యసాయి ట్రస్టు సభ్యులు రత్నాకర్‌తో పాటు యూనివర్సిటీ ఛాన్సలర్ చక్రవర్తి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ గౌతమి, అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో పాటు సత్యసాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన

నిందితులను శిక్షించాలి

కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులను వెంటనే శిక్షించాలని అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జనసేన, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐతోపాటు పలు ప్రజాసంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12ఏళ్ల బాలికపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులు క్రూరంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సమాజం తలదించుకునే విధంగా దుశ్చర్యకు పాల్పడిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ గాయత్రి, డిఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎం బాష, సిపిఎం నాయకులు రామిరెడ్డి, ప్రజాసంఘం నాయకులు జాకీర్, టిడిపి నాయకులు ముక్తార్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, జయమ్మ, జిల్లా ఫోక్‌పర్సన్ జెఎం.బాషా, జనసేన నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, ధరాజ్ బాషా, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, అంజి, సంపత్, ఆకుల అశోక్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, టీడీపీ సిటీ మైనారిటీ ప్రెసిడెంట్ హజీజ్, కాంగ్రెస్ నాయకులు హిమాం, శర్మాస్, ఎంఐఎం యూత్ ఇన్‌ఛార్జి మసూద్‌వలి, ఆప్ యూత్ లీడర్ మసూద్‌వలి, యాంటీ కరప్షన్ ఆఫ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షఫీ, హ్యూమన్ రైట్స్ మహిళా నాయకురాలు సరస్వతి, ముంతాజ్ బేగం, యాస్మిన్ భాను, జనసేన వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, జనసేన నాయకులు చిరు, సల్మాన్, పెండ్లిమర్రి శ్రీన, విజయ్ దేవరయల్, నౌషాద్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ విధులకు 'సెలవు'

◆ కొనసాగుతున్న అధికారుల సెలవుల పర్వం

◆ మొన్న డిసి.. నేడు ఎస్ఇ..

◆ గదుల సమస్యతోనూ ఉద్యోగులు సతమతం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక్కొక్కరుగా ఉన్నతాధికారులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రి ఇంతకుముందే మూడు నెలల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. తాజాగా సోమవారం నాడు సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ సైతం అనారోగ్య కారణాలతో ఆరు నెలల సెలవుపై వెళ్లారు. ఆయనకు సంబంధించిన సామగ్రి మొత్తాన్ని కార్యాలయం నుంచి తీసుకెళ్లారు. ఉన్నతాధికారికి తన సిమ్‌కార్డును సైతం స్వాధీనం చేశారు. ఇలా ఒక్కొక్కరుగా కార్పొరేషన్ కార్యాలయంలో దీర్ఘకాలిక సెలవులపై వెళ్తుండడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు లేకపోవడంతో ఆయా విభాగాల్లో పరిపాలన కుంటుబడుతోంది. ఇక కార్యాలయంలో గదుల కొరత కూడా పెద్ద సమస్యగా మారింది. డిఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లకు కూర్చునేందుకు కనీసం సీటు కూడా లేని పరిస్థితి కార్పొరేషన్‌లో ఉందని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో సమస్యలు రాజ్యమేలుతుంటే అటు కమిషనర్ గానీ ఇటు విభాగాధికారి కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కొంతమంది డిఈలకు స్వతంత్ర ఛాంబర్లు ఉండగా అసిస్టెంట్ ఇంజినీర్ విజయరాజు కూర్చోవడానికి వీలులేదని ఒక డిఈ హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. తన ఛాంబర్లో కూర్చీ వేయకుంటే రోడ్డుపై సీటు వేసినా కూర్చుంటానని అసిస్టెంట్ ఇంజినీర్ తోటి సిబ్బంది వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

గతంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈ సమయంలో ఆయన స్థానంలో పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సతీష్‌చంద్రను ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమించారు. నాగమోహన్ ఆకస్మికంగా వచ్చి విధుల్లో చేరారు. రెగ్యులర్ ఎస్ఈ వచ్చారని అంతా సంబరపడ్డారు. ఈ సంతోషం ఎక్కువ కాలం కొనసాగకనే మళ్లీ అనారోగ్య సమస్యలతో నాగమోహన్ మరోసారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన సెలవుపై వెళ్లడంతో ఎస్ఇ పోస్టు ఖాళీ అయ్యింది. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసి ఇటీవల పబ్లిక్ హెల్త్‌కు బదిలీపై వెళ్లిన రామ్మోహన్ రెడ్డిని ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమిస్తున్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఆయన ఈ బాధ్యతలను స్వీకరిస్తారా.. లేదా అన్నది తేలాల్సి ఉంది. చాలా వరకు విభాగాధికారులు సెలవుల్లో ఉండడంతో ఇన్‌ఛార్జిలుగా విధులు నిర్వహిస్తున్న వారిపై పనిభారం అధికం అవుతోంది. దీనికి తోడు కింది స్థాయి ఇంజినీర్ల నడుమ విభేదాలు మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. కార్యాలయంలో అధికారులు కొందరికే ప్రాధాన్యత కల్పించటం మరికొందరి పట్ల వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత కొన్ని నెలలుగా ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌ఛార్జుల పాలనే కొనసాగుతోందంటే అక్కడ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగోన్నతులు పొంది ఇతర ప్రాంతాల నుంచి బదిలీలపై వచ్చిన ఇంజినీర్లకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అడుగడుగునా ప్రతిబండకాలు ఎదురవుతుండటం వారిని తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి చేస్తోంది. అటు విభాగాధికారి గానీ, ఇటు కమిషనర్ గానీ ఆయా విభాగాల్లోని సమస్యల పరిష్కారంపై దష్టి సారించడం లేదనే వాదన ఉంది. హడావిడి చేసే కొంత మంది అధికారులకు అధికారాలు కట్టబెట్టి చోద్యం చూస్తున్నారనే చర్చ నడుస్తోంది. కొన్ని శాఖల అధికారులు అయితే ఇక్కడ పరిస్థితులతో రాజీపడలేక అవకాశం దొరికితే ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవాలని భావిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సమస్యల కారణంగా అటు ప్రజలకు కూడా పురసేవలు అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాలకవర్గం, ఉన్నతాధికారులు కార్పొరేషన్‌లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యే అవకాశం ఉందని కార్పొరేషన్ ఉద్యోగవర్గాలు భావిస్తున్నాయి.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం

8 నుంచి నిరవధిక సమ్మెకు మద్దతు

రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మికసంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి నిరవధిక పోరాటం కొనసాగించాలని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. డిసెంబర్ 8 నుంచి అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు మద్దతు కోరుతూ గురువారం నాడు అనంతపురంలోని జెవివి కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత నాలుగున్నర సంవత్సరాలుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన్ను కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. గత ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉంచిన సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి, రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. వీటితో పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ చేపట్టిన నిరవధిక సమ్మెకు కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నట్లు సమావేశంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున , సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుళు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఎఐటియుసి నాయకులు రాజేష్‌గౌడ్, టిఎన్‌టియుసి నాయకులు పోతులలక్ష్మి, నరసింహులు, బిసిసెల్ అధ్యక్షులు సిమెంటు పోతన్న, పూల బాషా, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే రైల్వే ప్రయివేటీకరణ

దుర్మార్గంగా ప్రధాని మోడీ చర్యలు - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రైల్వే వ్యవస్థను ప్రయివేటు పరం చేసే కుట్ర చేస్తోందని, ఈ నిర్ణయాన్ని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. రైల్వేల ప్రయివేటీయరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అనంతపురం రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల ప్రయాణానికి అత్యంత చౌకగా, అనువుగా ఉన్నది భారత రైల్వే సంస్థ అన్నారు. కోట్లాది మంది నిత్యం రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రైల్వే, వాటి ఆస్తులను బిజెపి ప్రభుత్వం ప్రయివేటు పరం చేయాలని చూడడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. రైల్వే స్టేషన్లు, వాటి చుట్టుపక్క ఉన్న స్థలాలను ఆదానీ, అంబానీలకు నామమాత్రపు లీజుకు కట్టబెడుతోందని విమర్శించారు. లాభాలొచ్చే 150 రైల్వే రహదారులను కార్పొరేట్లకు ఇచ్చి, లాభాలు రాని గ్రామీణ ప్రాంత రహదారులను మూసేయడం బిజెపి లక్ష్యంగా కన్పిస్తోందన్నారు. ఇప్పటికే రైల్ ఇంజన్లు, తయారీ, వ్యాగన్లు, బోగీలు, చక్రాలు మొదలుగునవి తయారుచేసే 7 సంస్థలకు ప్రయివేటు సంస్థలకు అప్పగించారన్నారు. ఇప్పుడు రైల్వే స్థలాలను ప్రయివేటు పరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. రైల్వే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే మోడీ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, రామ్‌రెడ్డి, ఏటీఎం నాగరాజ్, సురేంద్ర, ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ, ఎర్రిస్వామి, జిలాన్ పాల్గొన్నారు.

గుంతకల్లు : కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలు, ముఖ్యంగా రైల్వే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు డిమాండ్ చేశారు. రైల్వే ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ రైల్వేలో 7325 రైల్వేస్టేషన్లు, 1,26,366 కిమీ రైల్వేట్రాక్ నెట్‌వర్క్, 13,169 ప్రయాణికుల రైళ్లు (మెయిల్, ఎక్స్ ప్రెస్, పాసింజర్స్‌తో సహా,) 1246 గూడ్స్ షెడ్లు, 5 పర్వత ప్రాంత రైల్వేలు, అనేక రైల్వే స్టేడియంలు ఉన్నాయన్నారు. దేశంలో అతిచౌకయిన ప్రయాణం, సరుకుల రవాణా చేస్తున్న భారత రైల్వేల ధ్వంసానికి, రూ.లక్షల కోట్ల రైల్వే ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా 400 రైల్వేస్టేషన్లు, 90 ప్రయాణికుల రైళ్లు, 14 వేల రైల్వేట్రాకు, కొంకణ్ రైల్వే 741 కిమీ, 1.5 రైల్వే స్టేడియాలు, ఎంపిక చేసిన 265 రైల్వే కాలనీలు, 300 గూడ్స్ షెడ్లు, 4 పర్వత ప్రాంత రైల్వేలును రూ.1,52,496 కోట్ల నగదీకరణ కోసం ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వాలని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. రైల్వేస్టేషన్లు, చుట్టు పక్కల ఉన్న స్థలాలను ఆదానీ, అంబానీలకు నామమాత్రపు లీజుకు కట్టబెట్టేందుకు సిద్ధమైందన్నారు. వాటిలో హోటళ్లు, మాల్స్, యమ్యూజ్మెంట్ పార్కులు మొదలగు విచ్చలవిడి వ్యాపారాలు చేస్తూ వేల కోట్ల ఆదాయం వారికి అప్పజెబుతున్నారన్నారు. లాభాలొచ్చే 150 రైల్వే రూట్లు కార్పొరేట్లకిచ్చి, లాభాలు రాని గ్రామీణ ప్రాంత రూట్లను మూసేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చరణ్‌ప్రతాప్, చొక్కా సునీల్, వైటిసి.రమేష్, తిమ్మప్ప, షబ్బీర్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలు, ముఖ్యంగా రైల్వే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. రైల్వే ప్రయివేటీకరణ, మోడీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థల పట్ల వ్యవహరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ దేశ ప్రజల ఆస్తిగా చెప్పుకునే రైల్వేను మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయివేటీకరణ విధానాలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రైల్వేను ప్రయివేటుపరం చేస్తే ప్రయాణికులపై విపరీతమైన భారాలు పడతాయని, రైల్వే ఉద్యోగులు, కార్మికులకు భద్రత లోపిస్తుందన్నారు. ఇకనైనా మోడీ ప్రభుత్వం రైల్వే ప్రయివేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రయాణికులకు భద్రత కల్పించాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న 3.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, మధు, అంజి, రమేష్, కృష్ణనాయక్, హనుమంతు, ఓబులేష్, బాబు, శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, డివైఎఫ్ఐ నాయకులు అనిల్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : రైల్వే ప్రయివేటీకరణను ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు రామాంజి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే ప్రయివేటీకరణతో కార్పొరేట్ వారికే లబ్ధి చేకూరుతుందన్నారు. అంతేగాకుండా యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతుందన్నారు. లాభాలు అర్జించే రైల్వేను మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అతి పెద్దదైన రైల్వేరంగాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వన్నూరప్ప, ప్రసాద్, నరసింహమూర్తి, నాగరాజు, శ్రీరాములు, రాజు, రవి, ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

విడపనకల్లు మండల పరిధిలోని కొట్టాలపల్లిలో రైతులు సాగు చేసిన పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నారాయణరెడ్డి నాలుగెకరాల పొలంలో సాగుచేసిన కంది పంటను పరిశీలించి దిగుబడి వచ్చిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహార నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణిని కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, రైతు భరోసా సిబ్బంది శివ, లత, ముత్యాలు, లక్ష్మన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు యూనియన్ నాయకురాలు విజయ

ఎంపిపికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఉరవకొండ

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ఉరవకొండ ప్రాజెక్ట్ యూనియన్ నాయకురాలు విజయ డిమాండ్ చేశారు. ఈమేరకు విడపనకల్ మండలం ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డికి గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలు చెల్లిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందుకు ఎంపిపి స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సంఘం నాయకులు జె.రాజమ్మ, జె.నిర్మలాదేవి, వాణిశ్రీదేవి, భారతీదేవి, లక్ష్మి, గాయిత్రీదేవి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

క్లాప్ కలెక్షన్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలి : కమిషనర్ భాగ్యలక్ష్మి

మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'నగరంలో ఎక్కడ చెత్త అక్కడే కనిపిస్తోంది.. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.. క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి' అంటూ కమిషనర్ భాగ్యలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కౌన్సిల్ హాలులో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ క్లాప్ వసూళ్లు చేయాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను వేగవంతం చేయాలని, లేకుంటే శానిటరీ ఇన్స్‌పెక్టర్లకు మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. అలాగే శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పారిశుద్ధ్యం మెరుగుపరిచే విషయంలో, క్లాప్ వసూళ్ల లక్ష్యంలో అశ్రద్ధ వహిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పారిశుధ్య పరిస్థితులు మెరుగు పడుకుంటే శానిటరీ ఇన్స్‌పెక్టర్ పర్యవేక్షణ అధికారి కార్యదర్శి సంఘం శ్రీనివాసులుకు సైతం మెమో జారీ చేస్తామని స్పష్టం చేశారు. చెత్తకుండీల వద్ద చెత్త తొలగించిన తర్వాత దుర్గంధం వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్, సున్నం కలిపి చల్లాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఇఇ సూర్యనారాయణ పాల్గొన్నారు కమిషనర్

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మగ్బూల్ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మగ్బూల్ కుటుంబ సమస్యలతో గుత్తికోట రైల్వేస్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మహిళపై దాడి

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటంక గ్రామంలో ఓ దళిత మహిళపై దాడి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కోటంకలో పేదలు సాగు చేసుకున్న సర్వే నెంబర్ 243 ప్రభుత్వ భూమిలో పోలీసులు, గ్రామస్తులు గురువారం చింతచెట్లు నాటారు. దీంతో దళితులు సుగుణతోపాటు మరికొంతమంది రైతులు అడ్డుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు పేద రైతులపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో సుగుణకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై వివరాలు తెలియాల్సి ఉంది. కాగా పేదలపై దాడిని ఖండిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి తెలిపారు.

సాయిట్రస్టు ఆధ్వర్యంలో అంధులకు వివాహం

అంధుల జంటతో నాయకులు, సాయి ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

సాయిట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నగరంలోని తపోవనం చిన్మయ జగదీశ్వరాలయంలో అంధులకు వివాహం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమండ్రికి చెందిన మహేంద్ర కాల్ సెంటర్‌లో టెలికాలర్‌గా పనిచేస్తున్న అంధుడు మణికంఠారెడ్డికి కదిరికి చెందిన అనురాధకు వివాహం చేశారు. ముందుగా భగవాన్ సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి అరవింద నగర్ వారు భజన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిన్మయ మిషన్ ఆత్మ విధానంద, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య, వైసిపి నాయకులు అంథోనిరెడ్డి, సతీమణి శ్రీలతారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర డిడిఒ శ్రీనివాసులు, న్యూటౌన్ వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మల, సత్యసాయి భజన మండలి కన్వీనర్ నరసింహప్ప, గురుసేవ జ్యోతిష్యాలయం నంద్యాల రఘునాథ్, సత్యసాయి బాల వికాస్ గీత, సాయిసంస్థ అధ్యక్షుడు విజయ సాయికుమార్, ఆలయ సభ్యులు రామంజి, మురళి, రాఘవేంద్ర, నారాయణ నాయక్, ప్రవీణ్, బుల్లితెర నటుడు హర్షవర్ధన్, హర్షిత్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలల బస్సులను సీజ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్

మెటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎన్‌వి.రాజాబాబుతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎన్‌వి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, పామిడి, పెద్దవడుగూరు డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అనేక పాఠశాలల్లో బస్సులకు నిత్యం డ్రైవర్లను మారుస్తూ అనుభవం లేని, హెవీ లైసెన్స్ లేని వారిని నియమించుకుంటున్నారన్నారు. అదేవిధంగా అనేక బస్సులు పాతబడిన, ఫిట్నెస్ లేని బస్సుల్లో రవాణా కొనసాగిస్తున్నారన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వెంకీ, నాయకులు చందు, సాయి, అభి, రాకేష్, దినేష్, జిలాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

72 మంది గేట్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ విద్యార్థులు

గుత్తి : స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో దాదాపు 72 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సాఫ్ట్‌వేర్ దిగ్గజం హెచ్‌ఎల్‌సి కంపెనీ ఆధ్వర్యంలో గేట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులకు రాత, మౌలిక పరీక్షలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి శిక్షణ సమయంలో రూ. 2.2 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, ప్లేస్మెంట్ అధికారి తన్వీర్ అభినందించారు.

సాధువులకు దుస్తులు పంపిణీ

గుత్తి : శ్రీ భగవాన్ సత్య సాయి బాబా జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సాధువులకు గురువారం కైలాస ట్రేడర్స్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కైలాస్ ట్రేడర్స్ యజమాని డాక్టర్ కైలాస్, సత్య సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు కందుల సత్యనారాయణ రెడ్డి, దుర్గంశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు సన్మానం

అనంతపురం : ఇటీవల టిఎన్‌టియుసి అధ్యక్షులుగా నియమితులైన టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనారాయణ గురువారం అనంతపురంలోని స్వగృహంలో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతపురం పార్లమెంటు పరిధిలో ఉన్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు లక్ష్మీనారాయణ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, సత్యసాయి జిల్లా అధ్యక్షులు తాడాల నాగభూషణం, టిడిపి బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న, టిఎన్‌టియుసి నగర అధ్యక్షులు పూల బాషా, సత్యసాయి జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో లిఫ్ట్ ప్రారంభం

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ నూతనంగా నిర్మించిన మూడవ అంతస్తు కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను ఉపకులపతి జి.రంగజనార్ధన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ కళాశాల పురోభివృద్ధికి అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, యూనివర్శిటీ డైరెక్టర్లు, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.విశాలి, వి.బి.చిత్ర, జి.వి.సుబ్బారెడ్డి, పద్మ సువర్ణ, ఎ.సురేష్‌బాబు, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి స్వరూపరాణి, అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ. యూనివర్సిటీ ఇంజినీర్ అస్లాంబాషా, ఓటీపీఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ సి.గోపీనాథ్, బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కొట్టాలపల్లిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పెద్దవడుగూరు : మండలంలోని కొట్టాలపల్లిలో టిడిపి నాయకులు గురువారం టిడిపి ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు పరమేశ్వరరెడ్డి, సర్పంచి ఆదినారాయణ, రామచంద్ర, రంగప్ప, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించాలి

గుత్తి : పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు అంబేద్కర్ భవనం వద్ద గురువారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేస్తే దిగివచ్చిన అధికారులు భవన నిర్మాణానికి, అభివృద్ధి పాటుపడతామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందన్నారు. పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భవనం నిర్మిస్తే దళిత, గిరిజన, బీసీలు, మైనార్టీలకు సమావేశాలు, శుభకార్యాలు జరుపుకునేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కాశీం అడవి రాముడు, కరిడికొండ శివ, ఓబులేసు, శివరాం, రంగస్వామి, అంజి, రమణ, రమేష్, సిపిఐ నాయకుడు పూలమాబు తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో 'థ్యాంక్స్‌గివింగ్ డే'

అనంతపురం : నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం 'థ్యాంక్స్ గివింగ్ డే' నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇచ్చిన సాయంతో కురుకుంట్లలోని 'అంధ మహిళలు, చిన్న పిల్లల అనాథాశ్రమంలో' బియ్యం, దుస్తులు, పండ్లు, బిస్కెట్లు, చాకెట్లు తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం రమేష్‌బాబు, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రాధానాయుడు, వైస్ ప్రిన్సిపళ్ల వాణి, సుధ, గౌసియా, ఎఒ రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఇఒఆర్‌డికి సన్మానం

మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నార్పల : బదిలీపై వెళ్తున్న ఇఒఆర్‌డి లక్ష్మినరసింహను గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, రమాదేవి, శంకర్, రాజారెడ్డి, సుప్రియ, రామంజినేయులు, రమణకుమారి శివయ్య, కుళ్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, శ్రీరాములు, ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, ఎఇఒ నరపారెడ్డి, ఇఒఆర్‌డి శైలజారాణి, సూపరింటెండెంట్ ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్టు ఆనంద్, కార్యదర్శి అశ్వర్థనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

బాబా జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

అనంతపురం : భగవాన్ సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అరవింద్‌నగర్‌లోని శ్రీకృష్ణదేవరాయలు పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. చిన్న వయస్సు నుంచి చిన్నారులు విద్యాభ్యాసం మంచి నడవడికతో, సేవా దృక్పథంతో, పెరికి పెద్దవారైతే మంచి పౌరులుగా తయారవుతారన్నారు. చిన్నారుల కోసం వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు, మట్టి గాజులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో గురువారం అనాథలకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో చిన్నారులతో కలిసి కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రంలో గీతా ప్రచార సమితి అధ్యక్షులు దివాకర్ నిస్వార్థ సేవా సంస్థ వ్యవస్థాపకులు వెంకట్, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, శ్రీసత్యసాయి ధ్యాన మండలి సభ్యులు రామాంజనేయులు, జయరాములు, బాబు, రాము, కేశన్న, శ్రీవాణి, రజిని, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సత్యసాయి భజన మందిరంలో శ్రీసత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని సత్యసాయి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితుడు నందకిషోర్ పుష్పాలంకరణ, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాటిల్ శ్రీనివాస్‌రెడ్డి, దొణతిమ్మ రాయుడు, సాయిరాం, హనుమంతురెడ్డి, జగదీష్, సుబ్బన్న, పూర్ణిమ, భువనేశ్వరి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిఇఇ రాంప్రసాద్‌రెడ్డి గుత్తికి బదిలీ

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిఇగా పనిచేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గుత్తికి బదిలీ అయ్యారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వెంటనే బుధవారం రాత్రి రిలీవై గురువారం ఉదయం గుత్తి మున్సిపాలిటీలో విధుల్లో చేరారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అనంతపురం : కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని అన్ని డిపోల నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను సాధారణ ఛార్జీలతో నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆధోని గురువావారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు సంబంధిత డిపో మేనజర్లను గానీ, బస్సుస్టేషన్ ఎంక్వయిరీ (అనంతపురం-9959225866, తాడిపత్రి-9959225869)ను సంప్రదించాలని కోరారు.

సాయివిజ్ఞాన్‌లో ఇమ్యునైజేషన్ క్యాంపెయిన్

అనంతపురం : నగరంలోని సాయివిజ్ఞాన్ పాఠశాలలో గురువారం ఇమ్యునైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్, ప్రిన్సిపల్ లావణ్య రామ్ ఆధ్వర్యంలో 10ఏళ్ల చిన్నారులకు ప్రత్యేక డీడీ టీకాలు వేశారు.

పశువులకు మందులు పంపిణీ

బెలుగుప్ప : మండల కేంద్రంలోని గొర్రెల కాపరులకు గురువారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి రమేష్, పసి పశువుల వైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు

రైతులకు పరామర్శ

ఉరవకొండ : కంటి ఆపరేషన్లు చేయించుకున్న పదిమంది రైతులను జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు గురువారం పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌వి.ప్రసాద్ కంటి వైద్య ఆసుపత్రి, జై కిసాన్ ఫౌండేషన్ సహకారంతో వారం రోజుల క్రితం పదిమంది రైతులకు కంటి ఆపరేషన్లు చేయించిన విషయం తెలిసిందే. దీంతో వారి ఆరోగ్యంపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఉండబండ గ్రామ ఆదర్శ రైతు సురేష్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ సిఐగా నాగరాజు

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా ఎన్.నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప వన్ టౌన్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ శ్రీనివాసులును అనంతపురం విర్‌కు పంపారు. నూతన సిఐ నాగరాజు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పక్కాగా కులగణన

పెద్దవడుగూరు : గ్రామాల్లో చేపట్టే కులగణన కార్యక్రమం తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని ఎంపిడిఒ కుళ్లాయిస్వామి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి కులగణన చేపట్టాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రాయదుర్గం రూరల్ : కులగణన సర్వేకి సంబంధించి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు పట్టణ ప్రజలు సహకరించాలని కులగణన సర్వే నోడల్ అధికారి(డిఎల్‌డిఒ) శంకర్, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం 'కులగణన సర్వే'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ సర్వే ఈ నెల 27వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకూ జరుగుతుందని, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజల వద్దకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి సర్వేకు అవసరమయ్యే సమాచారం ఇచ్చి సహకరించా లని కోరారు.

కలశ ప్రతిష్టాపన

బొమ్మనహాల్ : మండల పరిధిలోని అరేసముద్రం గ్రామంలో జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో నూతనంగా ఆంజనేయస్వామి నిర్మించినట్లు సర్పంచి తిప్పేస్వామి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ గోపురంపై వేదమంత్రాలతో కలశ ప్రతిష్టాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్కే మెహతా, ఎజిఎం దేవరాజ్, ఏద్యం నారాయణ, జిమ్‌కుమార్ పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయం : ఎల్‌డిఎం

ఉరవకొండ : మహిళలు, నిరుద్యోగులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా బ్యాంకులు కృషి చేస్తున్నాయని ఎల్‌డిఎం సత్యప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పిఎంఇజిబి, స్టాండర్డ్ ఆఫ్ ఇండియా, ఎన్ఎల్ఎం స్కీమ్స్, ఇతర ఇన్సూరెన్స్ పథకాలపై మహిళా సంఘాలకు లోన్లు ఇచ్చే విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌డిఎం మాట్లాడుతూ ప్రతి బ్యాంకు పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కచ్చితంగా రుణాలు మంజూరు చేయాలని ఆయా బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రవీంద్రబాబు, కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రమోహన్, దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ గోపాల్, ఐకెపి ఎపిఎంలు, బ్యాంకు అధికారులు, డిఇఎ, టిక్కీ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రంపై అవగాహన సదస్సు

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గణిత శాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్కేయు గణిత శాస్త్ర విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ శోభలత మాట్లాడుతూ గణితాన్ని సులభంగా నేర్చుకోవచ్చన్నారు. ఓ చిన్న సమీకరణంతో ఎన్నో గణిత సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. గణితంలో రాణిస్తే ఇస్రో, డిఫెన్స్, ఎన్జీఐ, ఒఎన్జిసి, తదితర సంస్థల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి, గణితశాస్త్రం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

రాయదుర్గం : డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు బి.సుభాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు, కోర్టులో పెండింగ్ ఉన్న కేసులు, పెండింగ్‌లో లేని ఏవైనా సమస్య ఉన్న కేసులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులై ఉండి కూడా లబ్ధి పొందని వారు, బ్యాంకు, చిట్‌ఫండ్, మున్సిపాలిటీ, తదితర కేసులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామరని ఆయన తెలిపారు

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

రాయదుర్గం : విద్యార్థులు జీవితంలో దేశం గర్వించే స్థాయికి ఎదగాలని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఒ) హైదరాబాద్ శాస్త్రవేత్త ఎం.గంగాధర్ సూచించారు. డి.హీరేహాల్ మండల పరిధిలోని కల్యం గ్రామంలో ఉన్న బాల మేధావి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాను జీవితంలో ఎదిగిన విధానం, ఆటుపోట్లను ఎదుర్కొన్న తీరు, తదితర విషయాలను విద్యార్థులకు వివరిచంచారు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. అలాగే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యాన్ని తెలిపారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు వన్నూరుస్వామి శాస్త్రవేత్త గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు.

నాలుగున్నరేళ్లుగా ప్రతిఇంటికీ సంక్షేమం

'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు

పెద్దపప్పూరులో పథకాల బోర్డులను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని 16వ డివిజన్‌లో ఉన్న 28వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నాలుగున్నరేళ్లుగా చేసిన అభివృద్ధికి సంబంధించి బోర్డు, వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో నాలుగున్నరేళ్లుగా చేసిన మంచిని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. చంద్రబాబు పాలన మోసాలతో నిండితే.. జగన్ పాలన సంక్షేమానికి చిరునామాగా నిలిచిందన్నారు. నాటికీ, నేటికీ మధ్య మార్పును గమనించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగాలంటే జగన్‌ను మరోసారి సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వీరా రామకృష్ణారెడ్డి, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు మధుసుదన్‌గౌడ్, డివిజన్ కన్వీనర్ సుకేశ్, కార్పొరేటర్ హసీనా, కో ఆప్షన్ సభ్యురాలు మార్తా, సచివాలయ కన్వీనర్లు పల్లవి, జానీ, జాఫర్‌వలి, జాఫర్, మున్నా, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : వైసిపితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని స్థానిక కార్పొరేట్ ముంతాజ్‌బేగం తెలిపారు. గురువారం నగరంలోని 18వ డివిజన్‌లో 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ అబ్దుల్ గఫార్, దాదాపీర్ వైసిపి నగర అధ్యక్షుడు చింతామణి శేఖర్‌రెడ్డి, ఎంఎల్‌ఒలు దామోదర్ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, క్లస్టర్ కన్వీనర్ రమణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి గోగుల రాధాకృష్ణ, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో 'జగనే మళ్లీ ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో అవినీతికి తావు లేకుండా వాలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నామన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, సర్పంచి జయమ్మ సుందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రాజోలి రాంబాబు, గార్లదిన్నె అమర్నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, తురకపల్లె లక్ష్మిరెడ్డి, కమలాబాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మొక్కలు పంపిణీ

రాయదుర్గం : పట్టణంలోని చిందనూరు నాగయ్యశెట్టి కళ్యాణ మండపంలో గురువారం జరిగిన మౌనిక, శివకుమార్ వివాహ వేడుకలో వధూవరులు వివాహానికి హాజరైన అతిథులు, బంధుమిత్రులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫర్ ద పీపుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డిఎన్.మూర్తి, దుర్గం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కంబాల తిమ్మారెడ్డి, చెన్నమల్లప్ప, గౌని ప్రభాకర్ రెడ్డి శ్రీరామ్ ఫౌండేషన్ అనూష, కుందుర్పి సేవా ట్రస్ట్ ప్రతినిధులు సజ్జల సాగర్, భాస్కర్, అంబేద్కర్ రక్తదాన సమితి సభ్యులు మురళి, ఉపాధ్యాయులు మూలింటి గిరీష్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు మాంతేష్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE HUNGUND AT-HUNGUND DT-BAGALKOT, KARNATAKA STATE, MVC NO-315/2022

1) Smt Mahadevi W/o Muttanna Kanti
Age-52 Years Occ-House Hold work R/o ilkal
Tq-Bagalkot Dt-Bagalkot and others.
...Petitioners

V/S

1) M/s Mithun Constructions
Proprietor Gondhi Lingeswaraiah
D.No-16-796A, Nandalapadu, Tadapatri
Ananthput Dist, Andhra Pradesh State.
...Respondents

DRAFT SUMMONS ISSUED UNDER ORDER V RULE 20(1) OF C.P.CODE.

To,
M/s Mithun Constructions
Proprietor Gondhi Lingeswaraiah
S/o Gondi Adinarayana.
D.No-16-796A, Nandalapadu,
Tadapatri, Ananthpur Dist,
Andhra Pradesh State.

This is to inform to you that you are the respondent No-1 of above case which is filed for compensation rising out of motor vehicle accident. You are the owner of vehicle bearing Regd No-AP-02-TE 5017. Through this publication you are here by instructed you to attend the court on 3/1/2024 at-10-30 a.m personally or through fully instructed advocate to participate in the proceedings.

If you failed to appear on that day and time you will be placed ex- parte and the matter will be heard and decide in your absence on the available documents.

Given as per my order and under the seal of this Hon'ble court.

Hungund
Date: 17-11.2023.

Shirastedar
Principal Civil Judge Hungund

M.H.Malli
Advocate for plaintiff

ANANTAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT - Tender Notice.

1.	Tender Notice No.	576/2023-24/TO to 624/2023-24/TO, MP Lads & General Funds
2.	Scope of Work	Construction of CC Raods, Drains &Culverts, Compound Wall, Engaging of Vehicles & Excavator, Desiltation, & S&D of Electrical Poles & LED Lights
3.	Estimate Cost Ranging	**Rs. 1.50 to Rs. 22.00 Lakhs**

Note: The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/-
Commissioner
Municipal Corporation,
Anantapuramu.